క్లుప్తంగా

ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

నారాయణవనం: స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలోని జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభమైనట్లు హెచ్ఎం శశికళ తెలిపారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ, గత ఏడాది ఎంపీసీ, బైపీసీ గ్రూపులతో జూనియర్ కళాశాలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని, మంజూరైన పోస్టులలో అధ్యాపకులు చేరినట్లు చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలను తమ కళాశాలలో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు.

అన్నదానానికి విరాళం



చైర్మన్‌కు విరాళమిస్తున్న ప్రభాకర్‌నాయుడు

తొట్టంబేడు (రేణిగుంట): శ్రీకాళహస్తీశ్వర దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి సోమవారం శ్రీకాళహస్తికి చెందిన టి.ప్రభాకర్ నాయుడు, పద్మావతి రూ.50,116ను దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులుకు అందజేశారు. స్వామి, అమ్మవార్ల దర్శనానంతరం దాతకు స్వామి,అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో పాలక మండల సభ్యులు పసల సుమతి, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ బహిరంగ సభ

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక మండల పరిషత్ కార్యాలయ అవరణలో మంగళవారం ఉదయం 10 గంటలకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు తెలిపారు. మండలంలోని 28 గ్రామ పంచాయతీలలో ఏప్రిల్ 2022 నుంచి మార్చి 2023 వరకు చేసిన ఉపాధి హామీ పనులపై వారం పాటు సామాజిక తనిఖీ చేశారని, దీనిపై మండల స్థాయి బహిరంగ సభకు ప్రజాప్రతినిధులు, కూలీలు హాజరు కావాలని కోరారు.

ఎంఆర్‌సీకి చేరిన యూనిఫాం



యూనిఫాంను పరిశీలిస్తున్న ఎంఈఓ

బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని ప్రభుత్వ స్కూళ్లలో చదువుతున్న 3,457 మంది విద్యార్థులకు సంబంధించి యూనిఫాం స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయానికి చేరినట్లు ఎంఈఓ రవీంద్రనాథ్ తెలిపారు. జగనన్న విద్యాకానుకలో భాగంగా విద్యార్థులకు వీటిని స్కూళ్లు పునఃప్రారంభం అయ్యాక అందజేస్తానన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు పాల్గొన్నారు.

హ్యాండ్ బోరు రిపేరు చేశారు

ఏర్పేడు: మండలంలోని ఎండీపుత్తూరు పంచాయతీ మిట్టఇండ్లు గ్రామంలో సోమవారం చేతి పంపునకు మరమ్మతులు చేశారు. రెండు రోజుల క్రితం ఇది చెడిపోయింది. స్పందించిన సర్పంచ్ మోహనప్రియ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి మరమ్మతులు చేయించారు. గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించారు.

అర్చకులకు సంభావన



అర్చకులకు సంభావన అందజేస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి దంపతులు

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మ జాతరను విజయవంతం చేయడంలో భాగస్వాములైన అర్చకులకు సోమవారం సంభావనను తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి దంపతులు, మేయర్ శిరీష చేతుల మీదుగా అందజేశారు. ఆలయ అర్చకులు నలుగురికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున రూ.40 వేలు, గంగమ్మ విశ్వరూపాన్ని రూపొందించిన విశ్వబ్రాహ్మణ సంఘానికి రూ.25 వేలు, పేరంటాల వేషధారుడు కైకాల కులస్తుడికి రూ.10 వేలు అందజేసి అభినందించారు. ఆలయ ఈఓ ఎం.మునిక్రిష్ణయ్య, పాలక మండలి సభ్యులు వెంకటేష్, భారతి, వైఎస్సార్‌సీపీ నేతలు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, పాలగిరి ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఫిర్యాదుకూ పరిష్కారం

తిరుపతి తుడా: స్పందనలో వచ్చే ప్రతి ఫిర్యాదుకూ పరిష్కారం చూపాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత అన్నారు. ఆమె సోమవారం స్పందన, డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాల్లో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. వారంలోపు ప్రతి సమస్యనూ పరిష్కరించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు.

నిరుపయోగ వస్తువుల రీ సైక్లింగ్

ఇళ్లలో నిరుపయోగంగా ఉన్న వస్తువులను ఆర్ఆర్ఆర్ కేంద్రాల్లో ఇస్తే వాటిని రీసైక్లింగ్ చేసి తిరిగి ఉపయోగంలోకి తీసుకువస్తామని కమిషనర్ హరిత తెలిపారు. అన్నమయ్య కూడలి వద్ద ఏర్పాటు చేసిన ఆర్ఆర్ఆర్ సెంటర్‌ను ప్రారంభించారు. మేరీ లైఫ్ స్వచ్ఛ షహర్ కార్యక్రమంలో భాగంగా నగరంలోని అన్ని వార్డుల్లో ఆర్ఆర్ఆర్ (రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్) కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

పేద కుటుంబాల్లో ఆర్థిక ప్రగతి

- బలపడిన పేద కుటుంబాలు
- ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



బుక్‌లెట్‌తో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

కేవీబీపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబం ఆర్థిక ప్రగతిని సాధించిందని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. మండలంలోని అంజూరులో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించారు. ప్రభుత్వ పథకాల పరంగా ఆయా కుటుంబాలు పొందిన లబ్ధిని బుక్‌లెట్‌తో వివరించారు. సమస్యలపై ఆరా తీశారు. స్థానికంగా అధికారులు, నాయకుల దృష్టికి వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. అలాగే గృహసారథులు, కార్యకర్తలు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, ప్రతి ఒక్కరూ పార్టీ మరింత బలోపేతానికి కలసికట్టుగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ గవర్ల కృష్ణయ్య, ఎంపీపీ మునిలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు మునెమ్మ, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు బొర్రా మాధవీరెడ్డి, నేతలు నందకుమార్, లాల్‌బాబు యాదవ్, సర్పంచ్ సురేష్, ఎంపీటీసీ ప్రసాద్‌రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటరత్నం, సీనియర్ నేత చెంగయ్య, ఎంపీడీఓ రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు వినోభానగర్‌లో..

పిచ్చాటూరు: నాగలాపురం మండలంలోని వినోభానగర్‌లో మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించనున్నట్లు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ అపరంజిరాజు తెలిపారు.

రేపు ఎమ్మెల్యే పర్యటన

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం ఉదయం 10 గంటలకు సత్యవేడు ఎమ్మెల్యే గ్రామ సచివాలయాల వలంటీర్లను సత్కరిస్తారని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ అరణి విద్యానాథరెడ్డి తెలిపారు.

విద్యుత్ ఈ–మీటర్ల రీడింగ్ నమోదు తప్పనిసరి



మాట్లాడుతున్న ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో గ్రామాల్లోని తాగునీటి మోటార్లు, వీధి లైట్ల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ ఈ–మీటర్ల రీడింగ్‌ను ప్రతి నెలా గ్రామ కార్యదర్శులు, ఇంజినీరింగ్, ఎనర్జీ అసిస్టెంట్లు తప్పనిసరిగా నమోదు చేయాలని ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు ఆదేశించారు. సోమవారం తన కార్యాలయ సమావేశ మందిరంలో గ్రామ కార్యదర్శులకు విద్యుత్ ఈ–మీటర్ల రీడింగ్‌పై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, విద్యుత్ ఈ మీటర్ల రీడింగ్‌ను సక్రమంగా నమోదు చేయకపోవడంతో సంబంధిత శాఖాధికారులు చెప్పినమేరకు బిల్లు చెల్లించాల్సి వస్తోందని, పంచాయతీ నిధులు విద్యుత్ బిల్లులకే సరిపోతుందని పేర్కొన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ ఈ–మీటర్ల రీడింగ్‌ను నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ రాజశేఖర్, రజనీకాంత్ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన బాలలు



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

ఏర్పేడు: మండలంలోని రాజులపాలెం ప్రాథమిక పాఠశాల ఆవరణలో యువ సమాజ్ నిర్మాణ్ స్వచ్ఛంద సేవా సంస్థ సోమవారం విద్యార్థులతో మొక్కలు నాటించింది. అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించింది. చెట్లతో మానవాళి, పర్యావరణ పరిరక్షణకు కలిగే మేలుపై గ్రామస్తులకు అవగాహన కల్పించింది.

ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా విజయలక్ష్మి



తొట్టంబేడు (రేణిగుంట): శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్. విజయలక్ష్మి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె గతంలో నగరిలో సివిల్ సర్జన్ స్పెషలిస్ట్‌గా పనిచేసేవారు. బదిలీలలో భాగంగా సూపరింటెండెంట్‌గా ఇక్కడికి వచ్చారు. ఆమె మాట్లాడుతూ, ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి తన కృషి చేస్తానని, రోగులకు మెరుగైన సేవలు అందిస్తామని తెలియజేశారు.

ఏపీఓగా సుకన్య

నారాయణవనం: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మండల ఏపీఓగా సుకన్య బదిలీపై వచ్చారు. ఇదివరకు పనిచేసిన నాగభూషణమ్మ పిచ్చాటూరుకు బదిలీ అయ్యారు. నాగలాపురం మండలం నుంచి సుకన్య ఇక్కడికి వచ్చారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి పేద కుటుంబానికి ఉపాధి కల్పించి పనిదినాలతో పాటు కూలీల సంఖ్యను పెంచడానికి కృషి చేస్తామని ఆమె తెలిపారు.

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న అంజూరు శ్రీనివాసులు

రేణిగుంట: శ్రీకాళహస్తి సన్నిధి వీధిలోని జల వినాయకుని వద్ద ఉచిత సేవకునిగా పనిచేసిన మునీంద్ర మొదటి వర్ధంతి పురస్కరించుకుని సోమవారం శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు చేతుల మీదుగా పేదలకు అన్నదానం చేశారు. తొలుత మునీంద్ర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గోవర్ధన్, ధన, పసల కుమారస్వామి, నరసింహులు, తేజ, నూరి, మనోజ్, మోహన్, గణేష్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

దొరవారిసత్రం/తడ: తడ మండలం అక్కంపేట, దొరవారి సత్రం మండలం మావిళ్లపాడులోని ఆదర్శపాఠశాలల్లో 2023–24 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశం కోసం ఆసక్తి కలిగిన విద్యార్థులు వచ్చే నెల 7వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాళ్లు సౌజన్య, సీహెచ్ సుమలత వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. వివరాల కోసం 70329 96508, 95020 97754, 94906 97556, 89190 66398 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాకారులతో డీఎస్పీ భీమారావు తదితరులు

తొట్టంబేడు (రేణిగుంట): క్రీడలతో శారీరక, మానసికోల్లాసం కలుగుతుందని డీఎస్పీ భీమారావు అన్నారు. ఇటీవల సీఎం కప్ క్రీడా పోటీలలో ఆర్పీబీఎస్ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు టేబుల్ టెన్నిస్, టెన్నిస్ పోటీలలో రెండవ స్థానం సాధించారు. అలాగే కళ్యాణ దుర్గం, అనంతపురం జిల్లాలో జరిగినటు రాష్ట్రస్థాయి జూడో అండర్–19 విభాగం ఈ స్కూల్ కు చెందిన జాన్సీ, వైష్ణవి సిల్వర్ రజత, లలిత కాంస్య పతకాలను సాధించారు. వీరిని డీఎస్పీ అభినందిస్తూ సోమవారం సత్కరించి మాట్లాడారు. ప్రస్తుత పోటీ చదువుల కాలంలో విద్యార్థులకు క్రీడలు కూడా ఎంతో అవసరమన్నారు. ఫిట్‌నెస్ కలిగి ఉండటానికే కాకుండా స్పోర్ట్స్ కోటాకింద క్రీడా ప్రతిభ సర్టిఫికెట్లు ఉపయోగపడతాయన్నారు. వాసుదేవరావు ఈ క్రీడాకారులకు సమ్మర్ క్యాంపులో అల్పాహారం ఏర్పాటు చేశారు. అనంతరం పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ఆర్కాడు శంకర్ ఆధ్వర్యంలో డీఎస్పీని సన్మానించారు. కార్యక్రమం పీడీ వెంకటముని, గోపి, మురళి, నరేష్, క్రాంతి, గణేష్ పాల్గొన్నారు.

పళ్లికొండేశ్వరుని సేవలో సినీ నటి రవళి



సినీ నటి రవళి దంపతులకు చిత్రపటం అందజేస్తున్న ఆలయ చైర్మన్ బాలాజిరెడ్డి

పిచ్చాటూరు: నాగలాపురం మండలం సురుటుపల్లెలోని శ్రీ మంగళాదేవి సమేత పళ్లికొండేశ్వర స్వామిని సినీ నటి రవళి సోమవారం దర్శించుకున్నారు. ఆలయంలో కొలువుదీరిన స్వయంభు శ్రీ వాల్మీకేశ్వరస్వామి, శ్రీ మరగదాంబిగ, దాంపత్య దక్షిణామూర్తి, ప్రదోష నందిలకు ప్రత్యేక పూజలు చేశారు. రవళి దంపతులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం పలికారు. ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి స్వామివారి చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ నేత సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు మౌలిక సదుపాయాలు కల్పించరూ!



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

తొట్టంబేడు (రేణిగుంట): ఉపాధి కూలీలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలో తొట్టంబేడు పంచాయతీలో కోన కాలువలో చేస్తున్న పనులను పరిశీలించి, ఉపాధి కూలీల సమస్యలను తెలుసుకున్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు తులసి రాజన్, జిల్లా సహాయ కార్యదర్శి మించల శివకుమార్ మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలలో ఎక్కువగా ఉపాధి హామీ పథకంపై ఆధారపడి జీవిస్తున్నారని, ఉపాధి కూలీల వలసలు వెళ్లకుండా ఉన్న గ్రామంలోనే పనులు కల్పించాలని కోరారు. ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో నిధులు నిధులు పెంచాలని, ప్రతి కూలీకి 200 రోజులు పని దినాలు కల్పించాలని, రోజు వేతనం 600 రూపాయలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కోశాధికారి రుద్రపాకు శ్రీనివాసరావు, నరసింహారావు, ఫీల్డ్ అసిస్టెంట్, కూలీలు భాస్కర్, కృష్ణమ్మ, ధనమ్మ ,పరంధామయ్య, వెంకటస్వామి, సంగమ్మ, పెద్దమ్మ, మణి తదితరులు పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచిపోయేలా తిరుపతి అభివృద్ధి

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులు చరిత్రలో నిలిచిపోతాయని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఆయన సోమవారం మేయర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, భూమన అభినయ్ రెడ్డిలతో కలిసి సీఓసీ (సిటీ ఆపరేషన్ సెంటర్) కాంక్రీట్ పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రూ.వందల కోట్లతో నగర ప్రజలకు ఆధునిక సౌకర్యాలు కల్పిస్తున్నట్టు చెప్పారు. సీఓసీ బిల్డింగ్ తిరుపతి నగరానికి ఐకానిక్‌గా నిలిచిపోతుందన్నారు. ఎమ్మెల్యేగా అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు మౌలిక వసతులు కల్పించి ప్రజల రుణం తీర్చుకుంటున్నానన్నారు. మేయర్ శిరీష, కమిషనర్ హరిత మాట్లాడుతూ రూ.80 కోట్లతో సీఓసీ భవనాన్ని నిర్మిస్తున్నామన్నారు. ఎస్ఈ మోహన్, మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, స్మార్ట్ సిటీ ఎండీ చంద్రమౌళి, డీఈ దేవిక, వైఎస్సార్ సీపీ నాయకుడు పాలగిరి ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూమన లక్ష్మమ్మకు ఘన నివాళి

తిరుపతి మంగళం: తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి మాతృమూర్తి భూమన లక్ష్మమ్మ వర్ధంతి సందర్భంగా సోమవారం తిరుపతి సుందరయ్యనగర్ వద్ద ఉన్న శ్మశానవాటికలో ఆమె సమాధి వద్ద నివాళులర్పించారు. ఎమ్మెల్యే భూమన, ఆయన సతీమణి భూమన రేవతి, కుమారుడు భూమన అభినయ్‌రెడ్డి, కుటుంబ సభ్యులు, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, కార్పొరేటర్ వరికుంట్ల నారాయణ, టౌన్ బ్యాంకు డైరెక్టర్ పోలిరెడ్డి నాగిరెడ్డి, నాయకులు నాదముని, తాలూరి ప్రసాద్ పాల్గొన్నారు.

వలంటీర్లకు సత్కారం



అక్కుర్తిలో గ్రామ వలంటీర్లను సన్మానిస్తున్న పవిత్రారెడ్డి

కేవీబీపురం: పనితీరులో ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న 11 మంది అంజూరు గ్రామ సచివాలయ వలంటీర్లను సోమవారం సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శాలువాలతో సన్మానించి ప్రశంసాపత్రాలను అందజేశారు. వలంటీర్లు ప్రభుత్వానికి–ప్రజలకు మధ్య వారధులుగా ఉంటూ ఇళ్ల ముంగిటకే సేవలు అందిస్తున్నారని కొనియాడారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అమూల్యం

రేణిగుంట: గ్రామ వలంటీర్ల సేవలు అమూల్యమని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు చేర్చడంలో పార్టీలకు అతీతంగా వారు పని చేస్తున్నారని బియ్యపు పవిత్రారెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి మండలం అక్కుర్తి హైస్కూల్ ఆవరణలో సోమవారం అక్కుర్తి, అరవకొత్తూరు, ముచ్చివోలు, మంగళపురి, వేలవేడు సచివాలయాల పరిధిలోని 80మంది గ్రామ వలంటీర్లకు సేవారత్న పురస్కారాలను పవిత్రారెడ్డి ప్రదానం చేశారు. నిస్వార్థంగా సేవలందిస్తూ ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తున్న వలంటీర్లను సన్మానించడం సంతోషంగా ఉందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కాపిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, వైస్ ఎంపీపీ అక్కుపల్లి భానుమూర్తి యాదవ్, సర్పంచులు క్రిష్ణయ్య, వెంపల్ల సురేంద్ర యాదవ్, రవిశేఖర్ బాబు, ఎంపీటీసీ రాములమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు ప్రభాకర్, పుల్లయ్య, మనోహర్ రెడ్డి, గురునాధంరెడ్డి, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఉగ్గుమూడి సంధ్య అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తి కావస్తుండటం పురస్కరించుకుని సోమవారం ఆ పార్టీ నాయకులు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. నాలుగేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన వివిధ పథకాల గురించి తెలియజేసి సంబరాలు నిర్వహించారు. మళ్లీ నువ్వే జగనన్న సీఎం అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుబ్బలక్ష్మి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, సురుటుపల్లి ట్రస్టు బోర్డు మాజీ సభ్యులు రవిరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ కోటేశ్వరరావు, నాయకులు గెడితొట్టి గురవయ్య, ప్రసాద్ పాల్, దశకుమార్, మునిరాజా, చలపతి, ప్రసాద్, వేంకటేశ్వర్లు, బాలశేఖర్, చంద్రశేఖర్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

హైరిస్క్ ప్రసవాలపై అప్రమత్తం



హైరిస్క్ గర్భవతులతో మాట్లాడుతున్న వైద్యాధికారి తదితరులు

నారాయణవనం: ఒత్తిడికి గురై అధిక రక్తపోటు కారణంతో హైరిస్క్ ప్రసవాలకు గురికాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని మండల వైద్యాధికారి దర్శిత్‌రాజ్ అన్నారు. సోమవారం మండలంలోని 12 సచివాలయాల పరిధిలోని ఆరోగ్య ఉపకేంద్రాలలో హైరిస్క్ గర్భవతులకు సమావేశం నిర్వహించారు. సురక్షిత ప్రసవానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేయకూడని పనులపై అవగాహన కల్పించారు. దర్శిత్‌రాజ్ మాట్లాడుతూ, మండలంలో 86 మంది గర్భవతులు హైరిస్క్ పరిధిలో ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. అధిక రక్తపోటు కారణంగా కొంత ఇబ్బంది పడాల్సి వస్తుందని, ఒత్తిడికి గురికాకుండా సమతుల్య ఆహారం, పాలు, గుడ్లు, ఆకు కూరలు, పండ్లతో పాటు క్రమం తప్పకుండా కాల్షియం మాత్రలను తీసుకోవాలన్నారు. రోజూ సాధారణ యోగ, 30 నిమిషాల పాటు నడిస్తే రక్తపోటును నియంత్రంచుకోవచ్చన్నారు. సమోసాలు, పకోడీలు, ఊరగాయలు, పచ్చికూరల సలాడ్, పెరుగు, ఉప్పు చల్లిన ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలని అన్నారు. ఆశా వర్కర్లు రోజూ హైరిస్క్ గర్భవతులతో మాట్లాడి, వారి ఆరోగ్య పరిస్థితులను సంబంధిత ఏఎన్ఎంలను తెలపడంతో పాటు వైద్య పరీక్షలు చేయించి పీహెచ్‌సీకి నివేదించాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల నుంచి పౌష్టికాహారం అందేలా పర్యవేక్షించాలని క్షేత్ర స్థాయి వైద్య సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో వైద్యాధికారి రాగసుధ, సీహెచ్ఓ శ్రీనివాసులు, హెల్త్ సూపర్‌వైజర్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, హైరిస్క్ గర్భవతులు పాల్గొన్నారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న వన్‌టౌన్ సీఐ అంజూయాదవ్

వాహనాల తనిఖీ

తొట్టంబేడు (రేణిగుంట): ద్విచక్రవాహనదారులు నియమాలు పాటించకుంటే చర్యలు తప్పవని వన్‌టౌన్ సీఐ అంజూయాదవ్ హెచ్చరించారు. సోమవారం శ్రీకాళహస్తిలోని ఏపీ సీడ్స్ కార్యాలయంలో సమీపంలో పలు వాహనాలను పోలీసులు తనిఖీ చేశారు. జరిమానా విధించారు. సీఐ మాట్లాడుతూ, ఆటో డ్రైవర్లు భక్తులను మోసం చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. ప్రయాణికులకు అధిక సంఖ్యలో ఎక్కించుకుంటే చర్యలు తప్పవన్నారు. ద్విచక్రవాహనాదారులు ట్రిపుల్ రైడింగ్ చేస్తే వాహనాలను సీజ్ చేస్తామన్నారు. కారులో ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా సీట్ బెల్ట్ పెట్టుకుని ప్రయాణించాలని కోరారు. పట్టణంలో ద్విచక్రవాహనదారులు పిల్లలకు వాహనాలు ఇస్తే వాటిని సీజ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ తిమ్మయ్య, ట్రాఫిక్ ఏఎస్ఐ రియాజ్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

పోలీసుల తీరు మారకపోతే చర్యలు తప్పవు



ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌తో మాట్లాడుతున్న డీఎస్పీ

గూడూరు: ప్రజలతో పోలీసులు మర్యాదగా మసలుకోవాలని, ప్రజలతో వ్యవహరించే తీరు మారకపోతే చర్యలు తప్పవని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ హెచ్చరించారు. గూడూరులో ఆదివారం రాత్రి పోలీసులు స్వాధీనం చేసుకున్న ఒక వాహనానికి సంబంధించిన వారు ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌కు ఫోన్ చేసి పరిస్థితిని తెలియజేశారు. దీంతో ఎమ్మెల్సీ ఒకటో పట్టణ ఎస్ఐ పవన్‌కుమార్‌కు ఫోన్ చేసి వాహనాన్ని ఉంచుకుని వారిని పంపించి వేయాలని కోరారు. అలాగే అని ఎస్ఐ చెప్పగా.. కొంతసేపటి తరువాత బాధితులు ఎస్ఐ వద్దకు వెళ్లారు. వారిని చూడగానే ఆగ్రహించిన ఎస్ఐ వారితోపాటు ఎమ్మెల్సీపై నోరు పారేసుకున్నారు. ఈ విషయాన్ని వారు ఎమ్మెల్సీకి తెలియజేశారు. దీంతో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, నాయకులు, కార్యకర్తలతో కలిసి ఒకటో పట్టణ పోలీసు స్టేషన్ వద్ద సోమవారం ఉదయం ఆందోళన చేసేందుకు సిద్ధమయ్యారు. సమాచారం తెలుసుకున్న డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి ఎమ్మెల్సీ నివాసానికి చేరుకుని ఎమ్మెల్సీ, నాయకులతో చర్చించారు. ఎస్ఐను సెలవుపై పంపిస్తున్నామని, విచారణ చేసి తగిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హామీ ఇచ్చారు. దీంతో ఆందోళనకు తెరపడింది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కన్వీనర్లు బొమ్మిడి శ్రీనివాసులు, మల్లు విజయకుమార్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరు సునీల్ రెడ్డి, మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి మగ్దూం, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.